# వందశాతం ఓటింగ్ నమోదు కావాలి




మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

- ఉదయం పూట అధికంగా జరిగేలా చూడాలి
- వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు
- కథలాపూర్‌లో కార్యకర్తలకు అవగాహన

కథలాపూర్, నవంబర్ 29: వేములవాడ నియోజకవర్గంలో వందశాతం పోలింగ్ నమోదయ్యేలా చూడాలని వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు కార్యకర్తలకు సూచించారు. గ్రామాల్లో ఓటర్లను ఉదయమే పోలింగ్ కేంద్రాలకు తరలించి ఎక్కువ ఓట్లు పోలయ్యేలా చూడాలన్నారు. బుధవారం కథలాపూర్ మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలకు ఎన్నికల నియామవళి, నియమ నిబంధనలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి కార్యకర్త ప్రతి ఓటరును కలిసి పోలింగ్ కేంద్రాలకు తరలించాలన్నారు. ఎక్కువ శాతం ఓట్లు ఉదయమే పూర్తి చేయాలని అందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రతి కార్యకర్త తానే అభ్యర్థిగా భావించుకుని కష్టపడి పనిచేయాలన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తు మార్చే ఎన్నికలని, కేవలం ఎమ్మెల్యేల కోసమే కాదని ప్రజలు గమనించి ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు గడ్డం భూమారెడ్డి, మామిడిపెల్లి రవి, గుండారపు గంగాధర్, వర్ధినేని నాగేశ్వర్‌రావు, కల్లెడ శంకర్, మైస శ్రీధర్, కిరణ్ పాల్గొన్నారు.

# ఘనంగా దీక్షా దివస్



సిరిసిల్లటౌన్: తెలంగాణ భవన్‌లో అమరవీరుల స్తూపం ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 29: జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో బుధవారం దీక్షా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. అంతకుముందు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన కేసీఆర్ దీక్షతో తెలంగాణ సమాజం ఉద్యమంలో ఏకతాటిపైకి వచ్చిందన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన మహానీయుడు సీఎం కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్‌ను నేడు జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గంభీరావుపేటలో..**

గంభీరావుపేట, నవంబర్ 29: మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ దీక్షా దివస్‌ను బుధవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్ప ఫలితంగానే నేడు పేదలకు సంక్షేమ పథకాలకు అందుతున్నాయని చెప్పారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకుని మా అనాథ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌ను అందించారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న సీఎం కేసీఆర్‌పై ఆశీస్సులు ఉండాలని వెంకటస్వామిగౌడ్ వృద్ధులను కోరారు. కార్యక్రమంలో పటణాధ్యక్షుడు పెద్దవేని వెంకటియాదవ్, నేతలు లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి, పిట్ల శ్రీమతి తదితరులు ఉన్నారు.



గంభీరావుపేట: ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు అందిస్తున్న మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, నేతలు

## ఉద్యమాన్ని మలుపు తిప్పిన దీక్షా దివస్

**ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు సతీశ్‌కుమార్**

కోరుట్ల, నవంబర్ 29: సీఎం కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్ చరిత్రను మలుపు తిప్పిన రోజు అని ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్ అన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన దీక్షాదివస్ 14 ఏళ్లు గడిచిన నేపథ్యంలో బుధవారం ఆయన మాట్లాడుతూ, ఉద్యమ నాయకుడు కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహర దీక్ష తెలంగాణ పోరుకు రణ నినాదమైందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చావు నోట్లో తలపెట్టిన కేసీఆర్ చావో రేవో నినాదంతో ప్రజల చిరకాల స్వప్నాన్ని నిజం చేశారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలతో దేశంలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ త్యాగనీరతికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఇబ్రహీంపట్నం, నవంబర్ 29: వేములకుర్తి గ్రామానికి చెందిన కేడీసీసీబీ జిల్లా మాజీ డైరెక్టర్ ఆరె రాజ్‌కుమార్(48) బుధవారం ఉదయం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం, గ్రామశివారులో ఉన్న తన లత పౌల్ట్రీ ఫాం వద్దకు ఉదయం వెళ్లాడు. పౌల్ట్రీ ఫాంకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. పౌల్ట్రీ ఫాంలో పని చేస్తున్న కార్మికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. అక్కడికి కుటుంబ సభ్యులు వెళ్లి చూసే సరికి మృతిచెందాడు. కాగా పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడున్నారు. ఆయన మృతిపై గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఫేస్‌బుక్ మిత్రుల ఔదార్యం

**రూ.1.32 లక్షల ఆర్థిక సాయం**



సురేశ్ భార్య రాణికి నగదును అందజేస్తున్న రమేశ్

ధర్మపురి, నవంబర్ 29: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిపై ఫేస్‌బుక్ మిత్రులు ఔదార్యం చూపి రూ.1.32 లక్షల ఆర్థిక సాయం అందించారు. వివరాలిలా ఉన్నాయి. ధర్మపురి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దివిటి సురేశ్ కొన్నినెలల క్రితం ఉపాధి కోసం దుబాయికి వెళ్లాడు. అక్కడ సరైన పని దొరకకపోవడంతో ఆరు మాసాల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. అయితే దురదృష్టవశాత్తు నాలుగు నెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో కాలు, చేతు పడిపోయి మంచానికే పరిమితమయ్యాడు. వైద్యం కోసం ఇప్పటి వరకు రూ.4లక్షల వరకు అప్పు చేసి ఖర్చు చేయగా పూర్తిగా నయం కాలేదు. డబ్బులు లేక చికిత్స చేయించుకోలేక ఇబ్బందులు పడుతుండగా.. విషయం తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్, సురేశ్ ఆర్థిక, అనారోగ్య పరిస్థితిని వివరిస్తూ , మిత్రులు ఆదుకోవాల్సిందిగా కోరుతూ సురేశ్ భార్య రాణి బ్యాంకు ఖాతా వివరాలతో ఈ నెల 4న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. ఈ పోస్టుకు స్పందించిన ఎన్నారైలు రాణి బ్యాంకు ఖాతాలో రూ.1.32 లక్షలు జమ చేయగా బుధవారం ఆ నగదు డ్రా చేసి సురేశ్ భార్య రాణికి అందజేశారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ మిత్రులకు సురేశ్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

వీర్నపల్లి, నవంబర్ 29: మండలంలోని అన్ని గ్రామాల పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది సామాగ్రితో బుధవారం సాయంత్రం చేరుకున్నారు. జిల్లా కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి కేంద్ర బలగాల భద్రత మధ్య ప్రత్యేక వాహనాల్లో సిబ్బందిని తరలించారు. సీతారాంనాయక్‌తండా పోలింగ్ కేంద్రానికి చేరుకోవడానికి ఎన్నికల సిబ్బంది సామగ్రితో కిలోమీటర్ వరకు కాలినడకన నడిచి వెళ్లారు. మండలంలో 16 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సెక్టోరియల్ ఆఫీసర్ నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన వీర్నపల్లి, కంచర్ల, రంగంపేట, గర్జనపల్లి పోలింగ్ స్టేషన్లలో కేంద్ర సాయుధ బలగాలతో భద్రత కల్పిస్తున్నట్లు ఎస్ఐ నవత తెలిపారు.

## కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్

కలెక్టరేట్, నవంబర్ 29: సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల వెబ్ కాస్టింగ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను బుధవారం రాత్రి ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్, ఎన్నికల పోలీసు పరిశీలకురాలు వినీతా సాహు, ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి, కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ వెబ్‌కాస్టింగ్‌ను పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెండు పెద్ద డిజిటల్ తెరలను వీక్షించారు. ఇక్కడ సంబంధిత అధికారులు ఉన్నారు.

## ఎన్నికలకు సర్వం సిద్ధం

ఇల్లంతకుంట, నవంబర్ 29 : మండల కేంద్రం తోపాటు అన్ని గ్రామాల్లో ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో మీర్జా బుధవారం పేర్కొన్నారు. మండలంలోని 29 పోలింగ్ కేంద్రాలు, 58 బూత్‌లు ఉండగా 140 మంది ఎన్నికల సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 48 వేల ఓటర్లు ఉన్నారని తెలిపారు.

## పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

రుద్రంగి, నవంబర్ 29: నేడు మండలంలో జరుగునున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల అధికారి తెలిపారు. మండలం కేంద్రంతో పాటు మానాల, గిరిజనతండాల్లో మొత్తం 8 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో నలుగురు సిబ్బందితో పాటు అదనంగా పోలిస్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్ఐ రాజేశ్ తెలిపారు.



ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్ఎం వీ సుచరిత

# ఉత్తమ సేవలకు పురస్కారాలు

కలెక్టరేట్, నవంబర్ 29: విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందించిన వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రగతి చక్ర పురస్కారాలను ప్రతి యేటా అందిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ వీ సుచరిత తెలిపారు. బుధవారం సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్ ఆధ్వర్యంలో ప్రగతిచక్ర అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కరీంనగర్ రీజియన్‌లో సిరిసిల్ల డిపో రెండో స్థానంలో నిలిచినందున ప్రగతి చక్ర అవార్డులు పంపిణీ చేశామని తెలిపారు. విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందిస్తున్న శ్రామిక్, హెల్పర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లను ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సన్మానం తోపాటు అవార్డులు ఇచ్చి సత్కరించిదని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులను సన్మానించి అవార్డులను అందజేశామని వెల్లడించారు. ఇక్కడ డిప్యూటీ ఆర్ఎం సత్యనారాయణ, భూపతిరెడ్డి, ఏకే ఖాన్, ఎల్ సారయ్య, కే నర్సింహులు, జీ మల్లేశ్ పాల్గొన్నారు.